# ఊహించలేని విషయం

తొలినాటిరాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. ఇక మర్నాటి మధ్యాహ్నంకూడా ఎంతప్రయత్నించినప్పటికీ నిద్రపట్టక పోవడమనేది కొంతవరకూ ఆశ్చర్యాన్నే కలిగించింది ప్రకాశానికి!...కళ్లుమాత్రం బాగా మండుతున్నాయి!...ఆవలింతలు విపరీతంగా వస్తున్నాయ్!...అయినా నిద్దరరాలేదు. పరుపుమీద యిటూఅటూ దొర్లేడు. గట్టిగా కళ్ళుమూసుకొని 'రామరామ రామా' అని జపించడం మొదలెట్టేడు ఏకాగ్రచిత్తతకోసం...ఊహుఁ! నిద్రవచ్చే సూచనలేమీ కనిపించడం లేదు. కాని అలా పరుపుమీద కొంతసేపు దొర్లగాదొర్లగా యేదోమైకం కమ్మినట్టయింది! తానేదో వినగలిగినది వినలేనట్టూ, చూడగలిగింది చూడలేనట్టూ, మాట్లాడగలిగింది మాట్లాడలేనట్టూ 'ఫీల్' అయేడు. అదే నిద్రపట్టడానికి మొదటిదశ అనుకున్నాడు. ఆ సమయంలో ఏవిషయాన్నీ తన మనస్సులోకి జొప్పించకుండావుంటే నిద్ర పట్టేస్తుందనుకున్నాడు.

కానీ, "బాబుగారూ! ఎవరో మీగురించి వచ్చేరు" అని బంట్రోతు వెంకయ్య గదిలోకివచ్చి చెప్పేడు.

వెంకయ్యమీద చాలా కోపంవచ్చింది ప్రకాశానికి, మంచి బాగా నిద్దరవచ్చే సమయంలో లేపేసినందుకు!—

"ఎవరొచ్చినా సాయంత్రం రమ్మనమని చెప్పమని ఇందాకే నీతో చెప్పేనే!—బుద్ధిలేకపోతే సరి! పొమ్మను.

సాయంత్రం రమ్మని చెప్పు. ఇప్పుడు మంచినిద్రలో నున్నా రని చెప్పు." అన్నాడు ప్రకాశం అలా పడుకొనే!

"చిత్తం బాబయ్యా! అలాగే చెప్పినాను. లేచే వరకూ గుమ్మంలోనే కూకుంటానన్నారు." అన్నాడు వెంకయ్య.

"ఎవడ్రా వాడు?..."

"ఎవడో కాదు, బాబయ్యా!...ఎవరో అమ్మగారు. చదువుకున్న మనిషిలాగున్నారు. తెల్లగా చాలా బాగు న్నారులెండి. పాపం ఎంచేతో ముఖం వాడిపోయింది. మిమ్మల్ని ఓమారుచూసి, మీరనుగ్రహించకపోతే ఓదండం పెట్టేసి, "అంతే తనకర్మ" అనుకొనెల్లిపోతానంటున్నా రావిడ! చాలా మంచిమనిషి లాగున్నారు?" అన్నాడు వెంకయ్య.

"దేని కొచ్చిందావిడ?" అని లేచి కూర్చొని ఆందోళనగా అడిగాడు ప్రకాశం.

"ఏమోనండీ!... చెప్పలేదు" అన్నాడు వెంకయ్య.

"వెంకయ్యా! ఆమె కొంచెం పొడుగ్గా, తెల్లగా, సన్నంగా లొత్తలు కలిగిన బుగ్గలు కలిగుంది కదూ?"

"సరిగ్గా చూసినట్టే వర్ణించారు బాబయ్యా!"

"వెంకయ్యా! ఆవిడెవరో నాకు తెలిసిపోయింది. మరెవరు నాకోసం వచ్చే ఆడది? ఆ 'ప్రభే'!...చూడు వెంకయ్యా! 'బాబుగారికి నిన్నల్లా నిద్దరలేదు. తలుపు గడెట్టుకొని పడుకున్నారు, సాయంత్రంరండ'ని చెప్పేయి. ఆమె వెళ్ళిపోయేక నాతో చెప్పు. ఓ పదిహేనురోజులు సెలవు

పెట్టి ఏ పల్లెటూరైనా వెళ్ళిపోతాను. అన్నట్టు నా పేరామెకు తెలుసేమిటి?... తెలిసినట్టయితే యింటిపేరు మార్చేయి. ఏమైనాసరే నేనామెకు కనిపించడం మంచిపనికాదు. లోపలికిమాత్రం ఆమెని రానివ్వకు." అని భయాందోళనలతో చెప్పేడు ప్రకాశం.

"చిత్తం బాబయ్యా" అని వెంకయ్య వెళ్ళిపోయిన తరవాత గదిలో గడియపెట్టి మంచంమీద పడుకున్నాడు ప్రకాశం.

అదివరకు పడుతుందేమో అనుకున్న నిద్రకూడా ఇక పట్టదని ప్రకాశానికి తెలిసినప్పటికీ కళ్ళుమూసుకునే పడుకున్నాడు. అప్పట్లో నిద్రపట్టకపోయినా అతనంతగా విచారించడు. కాని ఆ ప్రభవిషయం మళ్ళీ జ్ఞాపకంరావడం అతని హృదయం భయంతో దడదడ కొట్టుకుంది. ఏదో బ్రహ్మాండమైన దెయ్యం తన గుమ్మంలో కాచుకూర్చున్నట్టూ తను బయటకువెళితే పట్టుకొని పీల్చిపిప్పిచేసేద్దామని అది అనుకుంటున్నట్టూ భ్రమించేడు.

రెండేళ్ళక్రిందటి ప్రభ!...మళ్ళీ యిప్పుడెందుకొచ్చినట్టు?...దాంతో తను ఆనాడే సంబంధం తెంచేసుకొని ఉమని పెళ్ళి చేసేసుకున్నాడే!-ఏదో దానిమూనాన అదుండక మళ్లా యిలా దాపరించేం దేవిటి? వెంకయ్యగాడితో చెప్పి బయటికి గెంటిస్తేనో?...ఉహూఁ!...లాభంలేదు. మరింత గోలచేస్తుంది. ఊళ్లోవాళ్ళంతా మూగుతారు. గడచిన విషయాలన్నిటినీ వాళ్ళముందు వెళ్ళగక్కుతుంది!... ఇంతటి మేనేజరు హోదాలోనున్న తన బ్రతుకంతా హాస్యాల

పాలవుతుంది! పోనీ కొంతడబ్బు వెంకయ్యగాడిచేత ఇప్పించేసి తగిలేస్తేనో?...ఊహుఁ?...అది డబ్బుకోసం వచ్చుండదు. దానికి కావలసినంత డబ్బుంది. మరి?–తనను చూడాలనీ మళ్ళీ తన భార్యగా చలామణీ అవుదామనీ వచ్చుంటుంది. అబ్బోస్!...అదెక్కడ! జిత్తులమారి నక్క. ఉమనీ, తననీ వేరుచేద్దామని దానుద్దేశ్యం, నయం!...ఉమ పురిటికోసం పుట్టింటి కెళ్ళబట్టిగానీ, అదేయిక్కడుంటే ఈపాటికి ఓ పెద్ద రణరంగం అయివుండాల్సిందేగదా తన యిల్లు. ఇంతకీ తని క్కడున్నట్టు ఆశనిదేవత కెలా తెలిసిందో అని అను కున్నాడు—

కానీ, "ప్రభ అలా తనగురించి రావడంలోతప్పేమైనా ఉందా?" అనే ప్రశ్న అతని మనస్సులో తెల్లగా లెక్కి రించినట్టయింది! ఇంతకీ ఆమె పరాయిస్త్రీయా? తను స్వహ స్తాలతో తాళికట్టి వివాహమాడిన ప్రభేకదూ అది? ఆమెను వివాహమాడకముందు తనోనాడు రోడ్డుమీద వెళ్తూ వెళ్తూ ఆకలిబాధతో స్పృహతప్పి పడిపోతే, తనకి సపర్యలుచేసి ఆదరించిన సహృదయే కదూ ఆమె?... ఆ ప్రభ అరుణ హస్తాల మధ్యేకదూ తానొకప్పుడు బంధింపబడి మహదా నందాన్ని పొందేడు?— ఎన్నో వెన్నెల రాత్రుళ్ళను ఎంతో ఆనందంతో, కులాసా కబుర్లు చెప్తూ ఆ ప్రభతోనే గదూ తాను గడిపేసేడు!—మరి అలాంటి ప్రభను, ఈనాడు తను అంత నిర్లక్ష్యంగా చూస్తూ, ఆ వీధిగుమ్మంలో ఎవరో కూలిది కూర్చుందనే భావంతో చూస్తే ఆమెహృదయం ఎంత బాధపడుతుంది?... ఆమెతో చెప్పకుండా అర్ధరాత్రి

వ్వుడు ఇంతదూరం వచ్చేసినందుకు ఆమె అప్పట్లో ఎంతగా దుఃఖించిఉంటుందో?... ఇంతకీ ఆమెను విడిచి తను వచ్చేయడానికి ఆమె చేసిన నేరమేఁవిటి మహా?—

—తనను ఆదరించింది. గౌరవించింది. హృదయ పూర్వకంగా ప్రేమించింది.తనే సర్వస్వం అని నమ్మింది... అందుకా ఆమెను తను విడిచిపెట్టినది?— ఏం న్యాయం?- ఎంత కృతఘ్నుడు తను?...

ఇంతకీ ఆమె చేసిన తప్పేఁవిటి?... ఓ బెంగాలీ యువతి అవడమా ఆమె తప్పు? ... ఆజాతిలో మళ్ళీ ఓ వేశ్య అయి వుండడమా ఆమె చేసినతప్పు?... వేశ్య కులానికి చెందినంతమాత్రాన ఆమె శీలంలో దోషం ఉందా? లేదే!... మరి ఆమెను విడిచిపెట్టడానికి కారణం?

— లోకులు!... అంటే అంటారు. వాళ్ళమాటలు పడలేక ఏపాపం ఎరగని అమాయకురాలిని విడిచి వచ్చేయడం ఏమంత న్యాయమైన పని?... మరి లోకులు అలా అంటారని మొదట తనకు తెలీదా?... ఆ మాత్రం లోకానికి జడిసేతను, ఆమెనెందుకు వివాహం చేసుకోవాలి?... అప్పుడే తన అశక్తతను ఆమెకి తెలియపర్చకూడదూ?... అప్పుడే ఆపనిచేస్తే ఈ బాధంతా లేకపోయేదే!... ఉసూరుమంటూ ప్రభ దుఃఖించకపోయేదే!... అదంతా తన తప్పు కాక ఆమె తప్పా?...

“బెంగాలీసానిని పెళ్ళాడేవేమిట్రో?” అన్నారు కొందరు. “సానిదానికి నీతేమిటి జాతేమిటి? అందులోకీ బెంగాలీది!” అన్నారు కొందరు. “ఒక జాతికి చెందిన వాడివి

కావేమిట్రా, ఇలాంటి వెధవబుద్ధులు పుట్టేయి?" అని కొందరు సన్నిహితులు చాలా సూటిగా ప్రశ్నించేరు తనని! "ఇదివరకు దాని కెన్నిమార్లు గర్భవిచ్ఛిత్తి అయిందో!" అని ప్రభను దూషించేరు కొందరు. "ఏదో వీడితో కొన్నాళ్లు వుంటుంది. ఆ తరవాత వీడికంట్లో కారంజల్లి మరొకణ్ని చేర దీస్తుంది. సానిదానికి నీతేఁవిటి జాతేఁవిటి?"అన్నారు మరికొందరు. ఇంకా చాలారకాలుగా అని లోకులు తన హృదయాన్ని గాయపరిచేరు; అసలువిషయాన్ని అర్థంచేసుకోలేని లోకం! తన హృదయాన్ని గాయపడిస్తే గాయపరుస్తారు!... అందుకని తనను నమ్మి హృదయపూర్వకంగా, ఆరాధించే ప్రభ హృదయాన్నా తాను గాయపరచి వచ్చేయడం?...

... ఆ రాత్రి ఎంత భయంకరమైన రాత్రి!— ప్రభ పడుకుంది తన ప్రక్కనే!... తనను చేతులతో చుట్టబెట్టి పడుకుంది నగుముఖంతో! మెల్లగా అతినేర్పుతో దానికి తెలివి రాకుండా చేతుల్ని తనమీదినించి తప్పించి తీసేసి, మంచం చప్పుడవకుండా మెల్లగా దిగేడు తనా రాత్రి. పాపం, ప్రభ యింకా నిద్రపోతూనేవుంది. తను ఏంచేస్తాడో, ఎక్కడికి వెళ్ళిపోతాడో ఆ అమాయిక కేంతెలుసు?... ధైర్యంగా నిద్రిస్తోంది! మెల్లగా బయల్దేరేడు తను. అతి నేర్పుగా గడియతీసి ఆనాడెంతో తెలివిగా రైలుస్టేషన్కి పరుగెత్తేడు. అన్నట్టు అలా తొందరగా పరిగెడుతున్నప్పుడు పార్కుదగ్గర మంచి గమ్మత్తుగా పడ్డట్టు జ్ఞాపకం! వెధవ దెబ్బ తగిలినట్టు తెలిస్తేకదూ!... ముణుకుమీద తగిలింది!... ఇంక రైలు ఎక్కినప్పుడుకూడా ఎంతో తెలివిగా

నేరుగా ఎవ్వరికీ కనిపించకుండా తలకి తువ్వాలు చుట్టేసు కొని ఎక్కేడు తను!

— మెల్లగా ఈ దేశానికి చేరుకున్నాడు తను. అదృష్టం ఉండబట్టి, బేంక్ మేనేజరు పదవి లభించింది! దానికి తోడు ప్రభకూడా లభించింది! ఒక సంవత్సరమై తను ప్రభని కొంతవరకూ మరచిపోయి కాలక్షేపంచేస్తున్నాడు. మళ్లీ యీనాడు ప్రత్యక్షమైంది. ఏం చెయ్యడం?...

ఇంట్లోకి చేరదీస్తే ఉమ యేమవుతుంది?... లోకు లేమంటారు? మళ్ళీ ప్రభతోపాటులేచి ఎక్కడైనా వెళ్ళిపో తేనో?... ఊహుఁ!... ఉమ గతేఁవిటవుతుంది? ఉమ ఆత్మ హత్య చేసుకుంటుందే!... లాభంలేదు, ప్రభనే పంపె య్యాలే! ఎలాగ?...

గదంతా చీకటైపోయినట్టయింది. మీదినున్న 'వెంటి లేటర్' వేపు చూసేడు. ఓ పెద్ద నల్లటి వానమేఘం హుటా హుటిగా వస్తున్నది!... వరాగంకూడా లేచింది!

ధైర్యంచేసి మెల్లగా లేచేడు ప్రకాశం. గదితలుపు తీసి, "వెంకయ్యా!" అని మెల్లగా పిల్చేడు.

వెంకయ్య వచ్చి, "ఏం బాబూ?" అనడిగేడు.

"అదెళ్ళిపోయిందా?" అనడిగేడు మెల్లిగా ప్రకాశం.

"లేదు బాబూ!...ఇంకా ఉన్నారు. ఆవిడ స్కూలు ఫైనలు పాసయిందిట. మొగుడు చనిపోయారట! తల్లీ పిల్లలూ వున్నారు. తనే పోషించాలట. మన ఆఫీసులో

ఏదైనా గుమాస్తాపని ఉంటేమో అని వచ్చారట! ఆవిడ పేరు కామాక్షట!" అన్నాడు వెంకయ్య.

ప్రకాశంగుండెల్లో దడ తగ్గింది. పెద్ద గాలిరావడం వల్ల కారుమేఘాలన్నీ చెదిరిపోయాయి. మళ్ళీ ఆకాశం నిర్మలంగా తయారైంది. ఆందోళనంతా తగ్గింది. ఏదో ఊహించశక్యంగాని ప్రమాదంనుంచి రక్షింపబడినట్టు భావించుకున్నాడు.

కానీ కామాక్షిమీద ఓరకంగా కోపంవచ్చింది. మధ్యాహ్నం నిద్రపోనియ్యకుండా గతించిన విషయాల స్ఫురణకు కారకురాలయి హృదయానికి భారాన్నీ, బాధనీ కలిగించినందుకు; ఫలితంగా ఆమె ఎంతగా బ్రతిమాలి కాళ్ళమీద పడినప్పటికీ "ఉద్యోగం లేదు' అని పొమ్మన్నాడు.

తీరా ఆమె నిరాశాహృదయంతో వెళ్ళిపోయిన తరువాత ఆలోచించాడు ప్రకాశం. అంతగా కాళ్ళమీదపడి బ్రతిమాలినప్పుడు, ఖాళీ ఉన్నప్పటికీ ఉద్యోగం యివ్వక పోవడం ఏం న్యాయమైన పని?—మధ్యాహ్నమల్లా ఆమెవల్ల తన మనస్సుని పాడుచేసుకున్నాడేగాని, ఆమె తన మనస్సుని పాడుచేసిందా?— వెంకయ్యగాడు చెప్పినవెంటనే తను అవతలకెళ్ళి చూసివుంటే ఇంతగా గతించిన విషయాలను స్ఫురణకు తెచ్చుకొని బాధ పడకపోయేవాడు!— ఇంతకీ తప్పు తనది. ఆ అర్థంలేని కోపంలో అనవసరంగా ఖాళీలు లేవని తను కామాక్షిని పొమ్మన్నాడు. పాపం ఆ అమాయిక నిరాశాహృదయంతో కృంగిపోయివుంటుందనుకున్నాడు

ప్రకాశం. మళ్ళీ ఆమె తనకు కనిపించదనుకున్నాడు. అయినా ఎందుకైనా మంచిదని—

— "మళ్ళీ కామాక్షి కనిపిస్తే తీసుకురా!" అని వెంకయ్యతో చెప్పేడు ప్రకాశం.

నిజానికి అదే ప్రభ అయివుంటే అప్పటి తన పరిస్థితి ఏరకంగా వుంటుందో ఊహించలేని విషయం అయింది ప్రకాశానికి! ఇంతకీ ప్రభ ఏమైవుంటుందోకూడా ఊహించలేక పోయాడు!—

---